సాక్షి అనంతపురం

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.26,500

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,500 పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 32.5°/12.3°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఆయుర్వేద ఆసుపత్రులపై విజి'లెన్స్'



తాహ ఆయుర్వేద ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అనంతపురం: నగరంలోని సాయినగర్‌లో డాక్టర్ మాలిక్ నిర్వహిస్తున్న తాహ ఆయుర్వేద హాస్పిటల్, రామచంద్ర నగర్‌లో డాక్టర్ రామ్ కుమార్ నిర్వహిస్తున్న అభయ ఆయుర్వేద కేంద్రాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాహ ఆస్పత్రిలో ఎటువంటి లైసెన్స్ లేకుండా మెడికల్ షాపులను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయుష్ విభాగం ఉత్తర్వుల మేరకు షాపులను మూసివేయించారు. చట్టపరమైన చర్యల నిమిత్తం బోర్డ్ ఆఫ్ ఆయుష్ విభాగానికి రిపోర్ట్ చేశారు. అదే విధంగా అభయ ఆయుర్వేద కేంద్రంలో ఉన్న మూడు రకాల అనుమానాస్పద మందులను సంబంధిత డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ద్వారా నమూనాలను సేకరించి విజయవాడలోని లేబోరేటరీకి పంపారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ఎం. నాగభూషణం, ఎస్. జమాల్ బాష, ఏఓ జే. వాసు ప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



లక్ష్మమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం: మండల పరిధిలోని బాల వెంకటాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దాసరి లక్ష్మమ్మ సోమవారం ప్రాణాలు విడిచారు. ఈమె భర్త ఎర్రప్ప 18 ఏళ్ల క్రితమే మృతి చెందారు. వీరికి ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. లక్ష్మమ్మ నిత్యం ఎంతో ఉత్సాహంగా ఉండేదని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. దాదాపు నాలుగు తరాలను చూశారని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడలతో విద్యాచైతన్యం



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురం ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యా చైతన్యం వెల్లివిరుస్తుందని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ బి.అనితగౌడ్ అన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ టోర్నీని సోమవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఎదుగుదలకే కాకుండా చదువుల్లోనూ రాణించేందుకు దోహదపడతాయన్నారు. ఎస్కేయూ క్రీడా విభాగం కార్యదర్శి జెస్సీ మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీలు ఆర్డీటీ మైదానంలో ఈ నెల 21వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీ కళాశాల వైస్‌చైర్మన్ సి.చక్రధరరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్ భట్, ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులునాయక్, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

ష్.. గప్‌చుప్!



లక్ష కాదు.. రెండు లక్షలు కాదు.. ఏకంగా రూ.అరకోటికి పైగా విలువైన అక్రమ మద్యం పట్టుబడింది. ఆ సరుకు పక్క రాష్ట్రాలకు చెందినది కాదు. ఎక్కడో దూరంగా ఉన్న గోవా నుంచి తెచ్చినది. కేసైతే నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు.. ఆ తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరే తీవ్ర విమర్శలకు తావిస్తోంది. గోవా మద్యం స్కాం వెనుక అధికార పార్టీ నేతలు ఉండటంతోనే కేసును నీరుగార్చే యత్నం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- 'గోవా మద్యం' కేసులో కానరాని పురోగతి
- అధికార పార్టీ ముఖ్య నేతల పాత్ర ఉన్నట్టు అనుమానాలు
- ఒక ఎమ్మెల్యే హస్తం ఉందని జోరుగా ప్రచారం
- ఎక్సైజ్, పోలీసుల తాత్సారంపై సర్వత్రా విమర్శలు



స్వాధీనం చేసుకున్న గోవా మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: సరిగ్గా వారం రోజుల క్రితం రాప్తాడు మండలం గంగలకుంట రైల్వే గేట్ సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో అక్రమంగా నిల్వ చేసిన గోవా మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ గోవాలో రూ.23 లక్షలు ఉండగా.. ఇక్కడ రూ.66 లక్షలు చేస్తుందని గుర్తించారు. నలుగురు అక్రమార్కులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు చిక్కకుండా అసలు సూత్రధారి పరారీ అయ్యాడు. గోవా నుంచి తీసుకొచ్చిన మద్యం బాటిళ్లను జిల్లాలోని బెల్టు షాపులకు తరలించి భారీగా సొమ్ము చేసుకోవాలని ప్లాన్ చేసినట్లు విచారణలో తేలింది. గోవా నుంచి ఎన్నో చెక్‌పోస్టులు దాటించి అత్యంత చాకచక్యంగా జిల్లాకు చేర్చినట్లు వెల్లడైంది.

టీడీపీ నేతలు.. అనుమానాలు

వేరే రాష్ట్రాలకు చెందిన మద్యం ఇంత పెద్దమొత్తంలో గతంలో ఎప్పుడూ పట్టుబడలేదు. ఈ క్రమంలో కేసుపై ప్రత్యేక దృష్టి సారించి మూలాలను తెలుసుకుని భవిష్యత్తులో మరోసారి అక్రమాలు జరగకుండా చూడాల్సి ఉంది. కానీ, ఎక్సైజ్ పోలీసులు ఆ దిశగా అసలు దృష్టే సారించడం లేదు. కేసులో అసలైన ముద్దాయిని త్వరలో అరెస్టు చేస్తామని ప్రకటించినా, ఇప్పటికీ అతీగతీ లేదు. ఈ క్రమంలో ఉద్దేశపూర్వకంగానే కేసు ముందుకు సాగకుండా చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గోవా మద్యం వ్యవహారంలో అధికార పార్టీ నేతల పాత్ర లేకపోతే ఇన్ని చెక్‌పోస్టులు దాటి ఇక్కడకు వచ్చేది కాదని పోలీసులే అనుమానిస్తున్నారు. దాడి సమయంలో చిక్కకుండా పరారైన నిందితుని వెనకాల అనంతపురం, రాప్తాడుకు చెందిన ఇద్దరు కీలక నేతలు ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులోనూ ఒక ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అందువల్లే కేసు పురోగతిపై సరిగా దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. కేసు విషయమై ఎక్సైజ్ అధికారులను వివరణ కోరినా దాట వేస్తున్నారు.

ఇప్పటికే రెండు సార్లు..

కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండు భారీ డంప్‌లు తెచ్చి విక్రయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఏపీలో మద్యానికి, గోవా మద్యానికి ధరలో భారీ తేడా ఉంటుంది. దీంతో అక్కడి నుంచి సరుకు తెచ్చి ఇక్కడి బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ఒక్కోదఫా రూ.50 లక్షలకు పైగా విలువైన గోవా మద్యాన్ని తెచ్చి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో విక్రయించారని సమాచారం. టీడీపీ ప్రజాప్రతినిధి చెక్‌పోస్టుల వద్ద ఉన్నవారికి భారీగా లంచాలు ఇచ్చి ఇక్కడికి చేర్చారని, అందుకే ఎక్సైజ్ పోలీసులు కేసు విషయంలో ముందుకు వెళ్లడం లేదనే విమర్శలు లేకపోలేదు.

పోలీసులూ మౌనం..

నాలుగు వాహనాలు రికవరీ అయితేనే ఎస్పీ స్థాయిలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ మీడియాకు వివరించే పోలీసులు వారం రోజులవుతున్నా ఇప్పటికీ గోవా మద్యం స్కాంలో అసలు దోషులెవరో బయటకు చెప్పడం లేదు. ఇప్పటికే రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాల పరిధిలోని ముఖ్యనేతల వైన్‌షాపులలో పర్మిట్ రూమ్‌లకు యథేచ్ఛగా అనుమతులిచ్చేశారు. ఈ విషయంపై జిల్లాలోని బార్ యాజమాన్యాలు రుజువులతో సహా ఫిర్యాదు చేశాయి. అయినా పోలీసులు వారిపై చర్యలు తీసుకునే పరిస్థితి లేదు. కూటమి ప్రజాప్రతినిధుల అక్రమ వ్యవహారాలన్నింటిపైనా మౌనం దాలుస్తుండటంపై సామాన్యులు మండిపడుతున్నారు.

ఎన్‌హెచ్ పనులు వేగవంతం చేయాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎన్‌హెచ్-544డీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సేకరణ, కేటాయింపు, పరిహారం పంపిణీ, బ్రిడ్జిల నిర్మాణం తదితర పనుల వేగవంతంపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూమ్‌లు

కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా నిర్మించిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని రికార్డు గది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో అక్కడి రికార్డులకు భద్రత సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో రికార్డులను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా మూడు స్ట్రాంగ్ రూమ్‌లను నిర్మించారు. కార్యక్రమంలో ఈఈ రమణారెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాల అధిపతులు వసంతలత, యుగేశ్వరి పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళం

సైనిక సంక్షేమ సాయుధ దళాల పతాక నిధికి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఉద్యోగుల సంఘం రూ.లక్ష విరాళం అందించింది. ఈ మేరకు డీడీని కలెక్టరేట్‌లో కలెక్టర్ వి.వినోద్ కుమార్ చేతుల మీదుగా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్పకు రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ అందజేశారు. అదే విధంగా రూ.5 వేల చొప్పున డీసీఓ అరుణకుమారి, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి విరాళం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ పతాక నిధికి ఉదారంగా విరాళాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తీర్చి ఆదుకోండి

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 355 వినతులు
- 'రక్తకన్నీరు' తుడవాలని హిమోఫీలియా బాధితుల వేడుకోలు

అనంతపురం అర్బన్: పింఛను మంజూరైనా ఇవ్వలేదంటూ కొందరు, భూ సమస్యలు పరిష్కారం కాలేదంటూ ఇంకొందరు.. ఇలా వివిధ సమస్యలపై ప్రజలు అధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి 355 వినతులు అందాయి. అంతకు ముందు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించాలని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వినతుల్లో కొన్ని...

- గత ప్రభుత్వం 2023 జనవరిలో పెన్షన్ మంజూరు చేసినా ఇప్పటివరకు పింఛను డబ్బు పంపిణీ చేయలేదని గార్లదిన్నె మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నుంచి డబ్బు రాలేదని అధికారులు చెబుతున్నారని వాపోయాడు.
- విద్యార్థి, కుల సంఘాల మాటున కొందరు పాఠశాలలకు వచ్చి డబ్బు కోసం ఇబ్బంది పెడుతున్నారని ప్రైవేటు పాఠశాల యజమానులు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాల యాజమాన్య సంఘాల నాయకులు సుబ్బారెడ్డి, సంజీవరెడ్డి, నాగరాజు, మారుతి, తదితరులు తమ సమస్యను విన్నవించారు. అధికారులకు ఫిర్యాదు చేస్తామని, ధర్నాలు, ఆందోళన నిర్వహిస్తామంటూ బెదిరిస్తున్నారని వాపోయారు. కొందరు యూట్యూబ్ ఛానళ్ల రిపోర్టర్ల ముసుగులో డబ్బు కోసం తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, ఇవ్వకపోతే సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- తన భూమిని వేరొకరి పేరున పట్టాపుస్తకం ఇచ్చారని బుక్కరాసముద్రం మండలం నీలంపల్లికి చెందిన పరుశురాముడు ఫిర్యాదు చేశాడు. గ్రామ పొలంలో తనకు 40 సెంట్లు ఉందని, ఈ స్థలాన్ని వేరొక వ్యక్తి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేశారని చెప్పాడు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా సమస్య పరిష్కారం కాలేదన్నాడు.
- గురుకుల పాఠశాలల్లో బోధన పోస్టులను డీఎస్సీ నోటిఫికేషన్‌లో చేరిస్తే తమ బతుకులు రోడ్డున పడతాయని గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షులు లోకన్న, విజయకుమార్ నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాల్లో పదేళ్లుగా 120 మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో బోధన విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. త్వరలో ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో గురుకుల బోధన పోస్టులను చేరిస్తే తామంతా వీధినపడే పరిస్థితి వస్తుందన్నారు. తమను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్పు చేయాలన్నారు. 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.



- ఇతని పేరు కురబ చెన్నప్ప. బెళుగుప్ప మండల కేంద్రంలో నివాసముంటున్నాడు. కొన్నేళ్ల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో చెన్నప్ప కుడికాలు తీవ్రంగా దెబ్బతినడంతో డాక్టర్లు తొలగించారు. అయితే ఇప్పటికీ పుండు మానలేదు. రోజూ శుభ్రం చేసి కట్టుకట్టాలి. కనీసం నడవలేని స్థితిలో ఉన్నాడు. ప్రస్తుతం వస్తున్న వికలాంగ పింఛను డబ్బు మందులకే సరిపోతోంది. దీన్ని రూ.15 వేల పింఛనుగా మార్పు చేసి ఆదుకోవాలని అర్జీ సమర్పించాడు.

'సాక్షి' తోడుగా కదిలిన హిమోఫీలియా బాధితులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హిమోఫీలియా బాధితులకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు అందక పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'సాక్షి'లో 'రక్త కన్నీరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాధితులు కదలారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కేంద్రాల్లో జరిగిన ప్రజా పరిష్కార వేదికతో పాటు తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, హిందూపురం ప్రాంతాల్లో తహసీల్దార్లను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమయానికి ఫ్యాక్టర్ ఇంజెక్షన్ వేయకపోతే శాశ్వత అంగవైకల్యం కలిగే ప్రమాదముందన్నారు. కుటుంబాలు జరిగేది ఇబ్బందిగా ఉందని, ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టర్‌ను బయట కొనుగోలు చేసే పరిస్థితులు లేవని వాపోయారు.



జేసీకి సమస్యను విన్నవిస్తున్న హిమోఫిలిక్ సొసైటీ అధ్యక్షుడు శ్యాంసుందర్

మానవత్వంతో ఆలోచించి యుద్ధ ప్రాతిపదికన ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచి ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హిమోఫిలిక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మఠం శ్యాంసుందర్ శాస్త్రి, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

ఘనంగా భక్తరపల్లి ఉత్సవాలు



బోర్లా పడుకున్న భక్తులను తొక్కుకుంటూ వస్తున్న భూతప్పలు

మడకశిర రూరల్: చదువుకున్న వారు..నిరక్షరాస్యులు..శ్రీమంతులు.. కూలిపని చేసుకుని జీవనం సాగించే బడుగు జీవులు..అందరిదీ ఒకటే కోర్కె. భూతప్ప పాదస్పర్శ తగిలితే చాలన్నది సంకల్పం. అచంచలమైన భక్తి విశ్వాసంతో నడిరోడ్డుపై బోర్లా పడుకున్నారు. తనువంతా కనులుగా చేసుకుని భూతప్పల కోసం ఎదురుచూశారు. పాదస్పర్శతో పునీతులైనట్లుగా భావించి సంబరంగా వెళ్లిపోయారు. ఈ అపూర్వ దృశ్యం సోమవారం మడకశిర మండలంలోని భక్తరపల్లిలో కనిపించింది.

ఆకట్టుకున్న ఉత్సవం

రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్ప, జ్యోతులు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరాగా భక్తరపల్లి జనసంద్రమైంది. తొలుత స్వామివారికి పూజలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భూతప్పల ఉత్సవంలో భాగంగా పాదస్పర్శ కోసం కింద పడుకున్నారు. భూతప్పలు తమపైనుంచి నడుచుకుంటూ వెళ్లగానే భక్తిభావంతో దండం పెట్టి అక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. అనంతరం నిర్వహించిన జ్యోతుల ఉత్సవం ఎంతగానో ఆకట్టుకుంది. తెల్లవారుజాము నుంచే మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను మోసుకుంటూ భక్తరపల్లి, జిల్లేడుగుంట ఆలయాలకు చేరుకుని స్వామివార్లకు సమర్పించారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కుబడి మేరకు వేరుశనగకాయలు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, చిరుధాన్యాలను గోపురంపైకి విసిరారు.

ఆకట్టుకున్న పాంజు ఉత్సవం

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన పాంజు ఉత్సవం కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పాంజుతో తలపై కొట్టించుకుంటే కష్టాలు తీరుతాయన్నది భక్తుల నమ్మకం. దీంతో పాంజుతో తలలపై కొట్టించుకోవడానికి భక్తులు ఎగబడ్డారు. అలా పాంజుతో కొట్టిన వారికి కానుకలు అందజేశారు. బ్రహ్మోత్సవాల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాగిరి రామయ్య బందోబస్తును ఏర్పాటు చేశారు. దేవదాయశాఖ అధికారులు, రథోత్సవం కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు.



స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



బొమ్మలా నిల్చున్న బాలుడు

● బువ్వ కోసం బొమ్మలా..

కూటి కోసం కోటి విద్యలు అంటారు. ఎవరేం చేసినా జానెడు పొట్ట నింపుకోవడం కోసమే. ఇలాగే తన కడుపు నింపుకునేందుకు ఓ బాలుడు బొమ్మలా మారుతున్నాడు. నిత్యం ఒంటి నిండా రంగు పూసుకుని రోడ్ల పక్కన నిలబడుతూ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. దాన ప్రభువులు దయతలచి ఎంతో కొంత ఇస్తే దాంతో పొట్ట నింపుకుంటున్నాడు. అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఇదిగో ఇలా కనిపించాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



వాహనదారులు ఇచ్చే డబ్బు తీసుకుంటున్న దృశ్యం

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆగాలని యజ్ఞం

పుట్టపర్తి రూరల్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగి.. ప్రపంచ శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ రష్యాకు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లిలోని హరిహర క్షేత్రంలో యజ్ఞం నిర్వహించారు. ఈ యుద్ధం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీస్థాయిలో జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొరుగు దేశాలకు వలస వెళుతున్నారని రష్యాకు చెందిన జ్యోతి, లిలియా చెప్పారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ భగవాన్ సత్యసాయి చేసిన బోధనలకు ఆకర్షితులమై 2005లో తాము పుట్టపర్తికి విచ్చేశామన్నారు. ప్రధాన రుత్వికులు సూర్యనారాయణ, వంశీకృష్ణ బాబుతో కలిసి 11 మంది వేదపండితులు హోమాన్ని, శ్రీదేవి,భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

జిల్లాకు 896 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి జిల్లాకు ఎరువులు సరఫరా అయ్యాయి. సోమవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన ఎరువులను రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి పరిశీలించారు. ఇఫ్కో కంపెనీ నుంచి 896 మెట్రిక్ టన్నులు సరఫరా అయినట్లు తెలిపారు. అందులో 514 మెట్రిక్ టన్నుల డీఏపీ, 382 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేసి మిగతావి కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక



వెంకటేశ్ నాయక్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: త్వరలో ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థి వెంకటేశ్ నాయక్ ఎంపికయ్యారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు చెందిన ఓ వలంటీర్‌కు రెండో సారి ఈ అవకాశం దక్కింది. దీనిపై వర్సిటీ ఉన్నతాధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వర్సిటీలో వెంకటేశ్ నాయక్‌ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శారద అభినందించారు. వర్సిటీకి రెండో సారి అరుదైన గుర్తింపు దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు.

'పట్టు' సహకార సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

అనంతపురం అగ్రికల్చర్: పట్టు పరిశ్రమశాఖ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి జనవరి 12న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశించినట్లు ఎన్నికల అధికారిగా నియమితులైన సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు కొనసాగే పాలక వర్గం ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏడు డైరెక్టర్ల స్థానాలకు ఎంపిక ఉంటుంది. మొత్తం 238 మందికి ఓటు హక్కు ఉంది. జనవరి 7న నామినేషన్ల స్వీకరణ, 8న పరిశీలన, 9న ఉపసంహరణ ఉంటుంది. ఎన్నిక అనివార్యమైతే 12న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఎన్నికైన డైరెక్టర్లను ప్రకటిస్తారు. అదే రోజు డైరెక్టర్లు సమావేశమై అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు.

ఆటో బోల్తా .. డ్రైవర్ మృతి



మృతుడు రామాంజనేయులు

పెద్దపప్పూరు: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు... గుత్తి మండలం కొత్తపేట గ్రామ సమీపంలో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకుడు నరసింహులు అన్నదానం కోసం బియ్యం సేకరణలో భాగంగా తాడిపత్రి ప్రాంతంలో పర్యటించాడు. సోమవారం ఆటోలో ఆయన తిరుగు ప్రయాణమయ్యాడు. పెద్దపప్పూరు మండలం జోడి ధర్మాపురం టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటో డ్రైవర్ రామాంజనేయులు (58) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న షేక్ మహమ్మద్, నరసింహులుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బరి తెగింపు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా సంక్రాంతి పండుగకు కోడి పందేలు నిర్వహిస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పెద్ద ఎత్తున బరులు గీసి పందేలు నిర్వహిస్తుండడం గమనార్హం.



- జిల్లాలో యథేచ్ఛగా కోడి పందేలు
- గుట్టుచప్పుడు కాకుండా రహస్య ప్రదేశాల్లో బరుల నిర్వహణ
- ఫోన్ల ద్వారా పందెంరాయుళ్లకు సమాచారం
- చేతులు మారుతున్న రూ.లక్షలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

అనంతపురం: సంక్రాంతి పండుగ సమయంలో కోస్తా జిల్లాల్లో ఎంతో మంది జీవితాలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేసే కోడి పందేలు తాజాగా అనంతపురం జిల్లాకూ విస్తరించాయి. ఎప్పుడు పడితే అప్పుడు పందేలు నిర్వహిస్తూ పందెం రాయుళ్లు కాసులు దండుకుంటున్నారు. ఈ మోజులో చాలా మంది సామాన్యులు తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారు.

మచ్చుకు కొన్ని...

» జిల్లా కేంద్రంలోని చెరువు కట్ట సమీపంలో ఉన్న ఓ వాటర్‌ప్లాంట్‌లో అత్యంత రహస్యంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. బైక్‌లు సుదూరంగా వదిలిన అనంతరం జూదరులు ఒక్కొక్కరుగా వాటర్ ప్లాంట్‌లోకి చేరుకుంటారు. ప్రత్యక్షంగా పాల్గొనలేని వారికి సెల్ ఫోన్ ద్వారా ఆట చూపిస్తారు. ఆట ముగిసేంత వరకూ వీడియోకాల్‌లో చూడవచ్చు. గెలిస్తే డబ్బును ఫోన్‌పే ద్వారా అందజేస్తారు. ఓడితే అప్పటికే ఇచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వరు. ఇలా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో ఆటను ఆస్వాదించే వెసులుబాటు కల్పించారు. ఇక్కడ కోడి పందెం జరుగుతున్నంతసేపు చుట్టూ ప్రైవేట్ సైన్యాన్ని కాపలాకు ఉంచుతున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున కూలి చెల్లిస్తున్నట్లు సమాచారం. పోలీసులు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే ఫోన్ చేసి అప్రమత్తం చేయడంతో నిర్వాహకులతో పాటు జూదరులూ పారిపోతున్నారు.

» రాప్తాడు పంచాయతీ పరిధిలోని చిన్మయనగర్‌లో నివాసముంటున్న ఓ వ్యక్తి తమిళనాడులో బరిలో దించే కోడిపుంజులను తీసుకు వచ్చి అమ్మకాలు చేపట్టాడు. ఒక్కో పుంజు ఏకంగా రూ.10 వేల నుంచి రూ.25 వేలకు అమ్ముడుపోతోంది. అనంతపురంలోని కమలానగర్‌లో దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి రోజుకు రూ.2 లక్షలు చొప్పున పందేం కాస్తూ.. పుంజు కోళ్లను కొంటున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే సదరు పందెం కోళ్ల కొనుగోలుకు రూ.5 లక్షల వెచ్చించినట్లు తెలుస్తోంది.

» అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పొలాల సమీపంలో ఈ ఏడాది నవంబర్ 15న కోడిపందేలు నిర్వహిస్తున్న 40 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అక్కడకు చేరుకుంటున్న సమయంలో చాలా మంది పారిపోయారు.

» ఆత్మకూరు మండలం యాలేరు చెరువు, గార్లదిన్నె మండలం రంగంపేట చెరువు, అనంతపురం రూరల్ పరిధిలోని తాటిచెర్ల రైల్వే కమ్మీల వద్ద రోజూ కోడి పందేలు జరుగుతున్నట్లు జూదరులు పేర్కొంటున్నారు.

ఒకరోజు ముందే సమాచారం:

కోడి పందేలు ఎప్పుడు నిర్వహించేది ఒక రోజు ముందు పందెం రాయుళ్లకు నిర్వాహకులు ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఎక్కడ జరిగేది పందెం రోజున తెలుపుతున్నారు. దీని కోసం జూదరులతో కలిపి ఓ వాట్సాప్ గ్రూపును సృష్టించినట్లు తెలిసింది. జనసంచారం తక్కువగా ఉండే రహస్య ప్రదేశాలను ఎంచుకుని బరులు ఏర్పాటు చేసి గుట్టుచప్పుడు కాకుండా తెల్లవార్లు పందేలు నిర్వహించి, మరుసటి రోజు ఉదయం 7 గంటలకు ముగించేస్తున్నారు. పెద్ద బరిలో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు 15 నుంచి 20 వరకు పందేలు జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు చిన్న బరుల్లో ఆరేడు వరకు పందేలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఈ ప్రక్రియలో రూ.లక్షల్లో డబ్బు చేతులు మారుతున్నట్లు సమాచారం. నేరుగా నగదుతో పాటు, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ముందుగానే డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ఆటకు రూ.రెండు లక్షలు సైతం బెట్టింగ్ కడుతున్నట్లు తెలిసింది. ఈ విషయం పోలీసులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

డెంగీతో చిన్నారి మృతి



లిఖిత (ఫైల్)

కళ్యాణదుర్గం: డెంగీ జ్వరంతో బాధపడుతూ ఓ బాలిక మృతి చెందింది. వివరాలు.. కళ్యాణదుర్గంలో నివాసముంటున్న శ్రావణ్ కుమార్తె లిఖిత (8) 45 రోజుల క్రితం జ్వరం బారిన పడింది. ఈ క్రమంలో తల్లిదండ్రులు చికిత్స చేయిస్తూ వచ్చారు. నయం కాకపోవడంతో ఆస్పత్రులు మారుతూ వచ్చారు. అయినా ఫలితం లేకపోవడంతో కొన్ని రోజుల క్రితం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు బాలిక డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారించి, చికిత్స మొదలుపెట్టారు. ఈ క్రమంలో జ్వర తీవ్రత పెరిగి బ్రెయిన్‌కు సోకడంతో నరాలు బలహీనమయ్యాయి. దీంతో శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, దీనికి రూ.10 లక్షల వరకూ ఖర్చు వస్తుందని అక్కడి వైద్యులు తెలిపారు. అంత పెత్త మొత్తాన్ని సమకూర్చుకోలేక ఇబ్బంది పడిన శ్రావణ్... ఇటీవల నేమకల్లు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును కలసి చిన్నారి పరిస్థితి వివరించి, ఆర్థిక సాయం చేయాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీనీ ఇచ్చారు. ఈ లోపు బాలిక పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందింది.

పెన్షన్‌దారులకు అండగా ఉంటాం : డీఆర్‌ఎం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: పెన్షన్‌దారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి అండగా ఉంటామని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన పెన్షన్ ఆదాలత్ కార్యక్రమానికి ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాప్రిల్ ఆరోరాతో పాటు హాజరైన డీఆర్‌ఎం మాట్లాడారు. అనంతరం పలువురు సీనియర్ పెన్షన్‌దారులను ఘనంగా సన్మానించారు. సమస్యలపై పెన్షన్‌దారులు అందజేసిన అర్జీలను పరిశీలించి, అక్కడిక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వే (పీఎస్ఆర్) అధ్యక్షుడు పీవీవీ ప్రసాద్‌రావు, ఆల్ ఇండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప, పెన్షనర్లు పాల్గొన్నారు.

నల్లతామర నివారణపై దృష్టి పెట్టండి

- ఉద్యానశాఖ అధికారులకు కలెక్టర్ సూచన
- క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్య పరచాలంటూ ఆదేశం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, చిత్రంలో జేసీ, ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల మిరప పంటను బాగా దెబ్బతీస్తున్న నల్లతామర పురుగు నివారణ చర్యలపై రైతుల్లో విస్తృతంగా అవగాహన పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. పురుగు నివారణ చర్యలపై ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను సోమవారం స్థానిక రెవెన్యూభవన్‌లో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. జిల్లాలో ప్రధానంగా విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, బెళుగుప్ప, కూడేరు, డి.హిరేహాల్ తదితర మండలాల్లో 30 వేల నుంచి 40 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో మిరప పంట సాగు ఉందన్నారు. గత రెండు మూడేళ్లుగా నల్లతామర ఆశించడంతో పంట దిగుబడులు తగ్గి రైతులకు నష్టాలు చేకూరుతున్నాయన్నారు. మిరపతో పాటు ఇటీవల మరికొన్ని పంటలనూ నల్లతామర ఆశించి నష్టపరుస్తున్నట్లు గుర్తించామన్నారు. నల్లతామర పురుగు ఉనికి, ఉధృతి గుర్తించి సమూలంగా నివారించే క్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. తొలిదశ, మలిదశలో చేపట్టాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ సిఫారసుల గురించి రైతులకు అర్థమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంగా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల మనసును హత్తుకునే తులసీదాసు శైలి

అనంతపురం కల్చరల్: జూటూరు తులసీదాసు రచనలు పిల్లల మనసు హత్తుకునేలా ఆకర్షణీయంగా ఉంటాయని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయుడిగా, బాలల గేయాల రచయితగా జిల్లా సాహిత్యంలో రాణిస్తున్న జూటూరు తులసీదాసు రచించిన 'కాకులు దూరని కారడవి' పుస్తకాన్ని సోమవారం రెవెన్యూభవన్‌లో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. సరళమైన భాషతో, కథలకు అనుగుణంగా ఉన్న ఛాయాచిత్రాలను పిల్లలు ఆస్వాదిస్తారన్నారు. ఇలాంటి బాలల కథలు చదువుపై ఆసక్తిని పెంచి ప్రేరణ కలిగిస్తాయన్నారు. అనంతరం తులసీదాసును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాదబాబు, డీసీఈబీ సెక్రటరీ గంధంనేని శ్రీనివాసులు, ఎస్ఎల్టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, ఆదిమూర్తి, గిరిజన ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి డెగావత్ రవీంద్ర పాల్గొన్నారు.

పాలకుల తీరుతోనే నిరుద్యోగ సమస్య

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: పాలకులు అనుసరిస్తున్న తీరుతోనే నిరుద్యోగ సమస్య పెరిగిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జనవరి 7న రాయదుర్గంలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ (అఖిల భారత యువజన సమాఖ్య) జిల్లా మహాసభల పోస్టర్లు, కరపత్రాలను స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విడుదల చేసి, మాట్లాడారు. దేశంలోని అన్ని రంగాల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను ప్రభుత్వాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం హామీలను విస్మరించారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, కాలయాపన చేయకుండా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షుడు మోహన్ కృష్ణ, నాయకులు ధనుంజయ, ఆనంద్‌బాబు, శ్రీనివాస్, రాంబాబు, శర్మాస్, లక్ష్మీరంగ, సురేందర్ పాల్గొన్నారు.

బియ్యం తరలింపుదారుడి బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక కొండూరు మార్గంలోని రంగనాయకులు మామిడి తోటలో 228 బస్తాల్లో 126.25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని డంప్ చేసిన కేసులో కర్నూలు జిల్లా డోన్ పట్టణానికి చెందిన బి.సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎస్.శ్రీధర మూర్తి ఎదుట బైండోవర్ చేయించారు. ఈ నెల 11న బియ్యం డంప్‌ను విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించి సీజ్ చేసిన విషయం తెలిసిందే. బియ్యాన్ని సురేష్ అక్రమంగా తరలిస్తూ తోటలో డంప్ చేసినట్లుగా నిర్ధారించుకున్న పోలీసులు సోమవారం బైండోవర్ చేయించారు.

మీ అభిమానం అపురూపం



తన పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'మీ అభిమానం అపురూపం' అని జిల్లా అధికారులతో కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. కలెక్టర్‌కు జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ మలోల, ఇతర అధికారులు కేక్ తినిపించారు. శాలువ కప్పి, పూల మొక్క అందజేసి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తాను పుట్టిరోజు వేడుక ఎన్నడూ ఇలా జరుపుకోలేదన్నారు. అందరితో కలసి ఇలా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అనుభూతిని.... అభిమానాన్ని ఎన్నటికీ మరవలేనన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేయండి



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: అర్జీల రూపంలో ప్రజలు విన్నవిస్తున్న సమస్యలు పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న వాటికి సత్వర పరిష్కారం చూపుతామని ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 84 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలో ఉన్నవాటికి పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి (అడ్మిన్), మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ వెల్లడించారు. అనంతపురంలోని విద్యుత్ నగర్ సర్కిల్‌లో సోమవారం మధ్యాహ్నం ఎస్ఐలు రుష్యేంద్రబాబు, గౌస్‌పీర్, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు పోలీసులను చూడగానే ద్విచక్రవాహనాన్ని వెనక్కు తిప్పుకుని వేగంగా ఉడాయించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కర్ణాటకలోని చెలికెర జిల్లా చిత్రదుర్గానికి చెందిన అంజనమ్మ కుమారుడు జితేంద్ర, అలియాస్ మరాఠీ జితేంద్ర ఉరఫ్ సిద్ధుగా నిర్ధారణ అయింది. కొంతకాలంగా బీకేఎస్ మండలం కేవీఎస్ నగర్‌లో నివాసముంటున్నాడు. నగరంలోని ఎస్వీ థియేటర్ వద్ద హోండా షైన్ బైక్, ఆర్టీసీ బస్టాండు ఆవరణలో స్పెండర్ ప్లస్ బైక్, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో హోండా యాక్టివ్ బైక్, ప్రకాష్ రోడ్డు పోలీస్ క్వార్టర్స్‌లో హోండా యాక్టివా స్కూటీని అపహరించినట్లు అంగీకరించాడు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కంప చెట్లలో దాచిపెట్టిన వాహనాలను చూసేందుకు వెళుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, స్వాధీనం చేసుకున్న నాలుగు వాహనాల విలువ రూ.3.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురం గ్రామ పాఠశాలలో ఈ నెల 7న నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో అల్లర్లకు పాల్పడ్డారని ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు శింగనమల సీఐ కౌలుట్లయ్య సోమవారం వెల్లడించారు. ఈ నెల 7న జరిగిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరయ్యారు. ఆ సమయంలో తనకు తగిన ప్రాధాన్యతనివ్వడం లేదంటూ ద్విసభ్య కమిటీ సభ్యుల మద్దతుదారుడు, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి తన అనుచరులతో కలసి వాగ్వాదానికి దిగాడు. ఎమ్మెల్యే వర్గీయులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఆయన వర్గం వినలేదు. సీఐ కరుణాకర్ కల్పించుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దీనిపై ఈ నెల 13న నార్పల మండలానికి చెందిన దళిత సంఘం నాయకుడు ఆదినారాయణ జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు శింగనమల సీఐ కౌలుట్లయ్య సమగ్ర విచారణ చేపట్టి అల్లర్లకు బాధ్యులైన టీడీపీ నేతలు చెన్నయ్య, అక్కులప్ప, నాగేంద్ర, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

హిందూపురం అర్బన్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. దాదాపు 40 ఏళ్ల వయసున్న మహిళ హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం పట్టాలు దాటుతుండగా బెంగళూరు నుంచి పెనుకొండ వైపుగా వెళుతున్న రైలు ఢీకొన్నట్లుగా సమాచారం. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు 93988 99299, 89195 50400 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని జీఆర్పీ ఎస్ఐ బాలాజీ నాయక్ కోరారు.

సాయి చెంత... కృష్ణా భక్తుల పులకింత



నందగోపాలం నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి రూరల్: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన దాదాపు 3 వేల మంది కృష్ణా జిల్లా భక్తులు సత్యసాయి మహాసమాధి చెంత ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పులకించిపోయారు. మహానగర సంకీర్తనలో భాగంగా పల్లకీ ఉత్సవాలు, రథోత్సవాలు నిర్వహించారు. ఆయా ఉత్సవాల్లో చిన్నారులు విశేష అలంకరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు పాల్గొన్నారు.



దశావతారాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు



మహానగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్.జె.రత్నాకర్‌రాజు

సూపర్‌లో అరుదైన శస్త్రచికిత్స



కోలుకుంటున్న సుజాతబాయిని చూపుతున్న జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగం ఓ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. వివరాలను సోమవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గూనిపల్లికి చెందిన 30 ఏళ్ల వయసున్న సుజాతబాయి తలనొప్పితో బాధపడుతూ చూపు తగ్గిపోయింది. దీంతో చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు వెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు సుజాతబాయికి పిట్యూటరీ ట్యూమర్ ఉందని నిర్ధారించారు. శస్త్రచికిత్సకు రూ.5 లక్షలు అవుతుందన్నారు. అయితే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న ఆమె అంత పెద్ద మొత్తాన్ని చెల్లించుకోలేకపోయింది. అయితే ఆరోగ్యశ్రీ పథకం అక్కడ లేకపోవడంతో స్వగ్రామానికి చేరుకున్న ఆమె అనంతరం అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చూపించుకుంది. పరీక్షించిన న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ ఆమెను గత నెల 21న అడ్మిట్ చేయించుకున్నారు. చికిత్సలో భాగంగా ఈ నెల 12న ఆమె స్కల్ ఓపెన్ చేయకుండా ముక్కు ద్వారా ఎండోస్కోపీ (మినిమల్లీ ఇన్వాసివ్ బ్రెయిన్ సర్జరీ) విధానంలో ట్యూమర్‌ను పూర్తిగా తొలగించారు. సర్జరీ ద్వారా కోలుకోవడానికి 15 నుంచి 20 రోజుల సమయం పట్టింది. ప్రస్తుతం ఆమె కంటి చూపు మెరుగుపడుతోంది. సర్జరీలో అనస్తీషియా వైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం బృందం, స్టాఫ్‌నర్సు అనిత తదితరులు పాల్గొన్నారు. సర్జరీని విజయవంతం చేసిన న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ బృందాన్ని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అభినందించారు.

క్లుప్తంగా

వ్యర్థాల నిర్వహణ చాలా ముఖ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు

అనంతపురం: అధునాతన సాంకేతికతో వ్యర్థాల నియంత్రణను అనుసంధానించాలని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు అన్నారు. సోమవారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని కెమికల్ విభాగంలో 'సుస్థిర వ్యర్థాల నిర్వహణ సాంకేతికత (సస్టయినబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ) అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆరు రోజుల పాటు జరగనుంది. ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వహణ చాలా ముఖ్యమైనది. ప్రస్తుతం ప్రపంచమంతా ఈ అంశంపైనే దృష్టి సారించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన సాంకేతికత అనివార్యమన్నారు. సదస్సు కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ టి. బాలనరసయ్య, కో కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ దిలీప్ కుమార్ వ్యవహరించారు.

పూర్వ విద్యార్థుల సందడి



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు ఉన్నత పాఠశాలలో చదివిన 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులంతా ఒకచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం చదివిన పాఠశాలకు గుర్తుగా బీరువా బహూకరించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పాటించాల్సిన సురక్షిత ప్రమాణాలపై నగరంలోని అక్బర్ ఆస్పత్రి సిబ్బందికి అగ్నిమాపకశాఖ అధికారులు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు గాబర పడకుండా అందుబాటులో ఉన్న పరికరాలతో ధైర్యంగా మంటలార్పే ప్రయత్నం చేయాలని అగ్నిమాపక అధికారి కేపీ లింగమయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అక్బర్ సాహెబ్, అగ్నిమాపక సిబ్బంది కృష్ణ కుమార్, తిప్పేస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

గుజిరీ గోడౌన్ దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం

రాప్తాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుజిరీ గోడౌన్ దగ్ధమైంది. సోమవారం జరిగిన ఆ ఘటనలో ప్లాస్టిక్ వస్తువులు, ఐరన్ అగ్నికి ఆహుతయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలో అనంతపురానికి చెందిన వీనిలాకు చెందిన గుజిరి గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. గౌడౌన్‌లో సరుకు మొత్తం కాలిపోయింది. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు సమాచారం. బాధితుడి సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.







'పుష్పాల' పలకరింత

అనంతపురం నుంచి గుత్తి వైపునకు వెళ్లే 44వ నంబర్ జాతీయ రహదారి మధ్యలో రకరకాల పూల మొక్కలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి మొక్కలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. కిలో మీటర్ల మేర దారి పొడవునా విరబూసిన పూలు మనస్సును దోచుకుంటున్నాయి. ఆహ్లాదంగా కనిపిస్తున్న పూలమొక్కల మధ్య ప్రయాణం కొత్త అనుభూతి ఇస్తోంది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు వాహనాలను ఆపి మరీ.. పుష్ప సోయగాన్ని ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

అభివృద్ధి పనులకు మోక్షం కలిగేనా?

- అర్ధంతరంగా ఆగిన పనులు
- నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం
- 50 అంశాలతో అజెండా సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చతికిలపడింది. నగరంలో ఎక్కడా చూసినా రోడ్లన్నీ గుంతలమయం. చెత్తకుప్పలతో నగరం కంపు కొడుతోంది. నగరాభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏనాడు అభివృద్ధిపై వీరు అధికారులతో ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. ఒకటి కాదు రెండు కాదు దాదాపు 80కి పైగా అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇటువంటి తరుణంలో మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. కౌన్సిల్ రసాభాసగా జరిగే అవకాశం లేకపోలేదు.

అంశాలు ఇవే..

వేణుగోపాల్ నగర్‌లో రూ.12.20 లక్షలతో సెంట్రల్ లైటింగ్, శ్రీనగర్ కాలనీలో ఎన్ క్యాప్ నిధులు రూ.2.4 కోట్లతో రోడ్డు విస్తరణ, రోడ్డు ఏర్పాటు, 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ గ్రాంట్స్ చెల్లింపులు, ఇంజినీరింగ్ విభాగంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల వేతనం పెంచుట, 38వ డివిజన్‌లో రూ.47 లక్షలతో 1000 ఎంఎం సీసీ డ్రైన్, వీధి లైట్ల నిర్వహణకు సంబంధించి రూ.39 లక్షలతో హైడ్రాలిక్ లిఫ్ట్ ప్లాట్ 13 ఎం, పీఏబీఆర్ డ్యాంలో ఏర్పాటు చేసిన మోటర్‌కు సంబంధించి రూ.50 లక్షలు చెల్లింపు, 24వ డివిజన్‌లో రూ.38 లక్షలతో సీసీ డ్రైన్, లక్ష్మీనగర్‌లోని కోదండ రామ శివాలయ అభివృద్ధి సేవా సమితి ఇంటి పన్ను మినహాయింపు, శ్రీనగర్ కాలనీలోని నీరుప్రగతి వనం సమీపంలో రూ.17 లక్షలతో సెంట్రల్ లైటింగ్, 29వ డివిజన్‌లో రూ.11.35 లక్షలతో సీసీ రోడ్డు, నగరంలోని రెండవ సచివాలయంలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు, 2వ డివిజన్‌లో రూ.12.25 లక్షలతో సీసీ రోడ్డు, అశోక్ నగర్‌లో రూ.13 లక్షలతో సీసీ డ్రైన్, 10వ డివిజన్‌లో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు, 34వ డివిజన్‌లో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు, 30వ డివిజన్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు, 13వ డివిజన్‌లో రూ.17 లక్షలతో సీసీ డ్రైన్, 13వ డివిజన్‌లో రూ.17 లక్షలతో సీసీ డ్రైన్, 5, 15వ డివిజన్‌లో రూ.19 లక్షలతో బీటీ రోడ్డు, 1వ డివిజన్‌లో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు, 50వ డివిజన్‌లో రూ.21 లక్షలతో సీసీ డ్రైన్, 43వ డివిజన్ కళారామంలో రూ.22 లక్షలతో వాకింగ్ ట్రాక్, 1వ డివిజన్‌లో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు, రూ.25 లక్షలతో సీసీ రోడ్డు, 49, 50 డివిజన్లలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, తదితర రోడ్లు, కాలువ ఏర్పాటు అజెండాలో పొందుపర్చారు.

సమావేశం సజావుగా జరిగేనా?

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రెండో కౌన్సిల్ సమావేశం జరగనుంది. గత ఆరు నెలలుగా నగరంలో అభివృద్ధిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పాటు రెవెన్యూ విభాగంలో ఇష్టారాజ్యంగా సీట్ల మార్పు, రూ.లక్షల్లో సీ బిల్లులు, నగరంలో అనధికారికంగా నిర్మాణాలు, తదితర వాటిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటి తరుణంలో కౌన్సిల్ సమావేశం చర్చనీయాంశమైంది.

ఉద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం



డీటీఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: గిరిజన గుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలువునా మోసం చేశారని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. సోమవారం దామోదర సంజీవయ్య సంక్షేమ భవనం ముందు గిరిజన గురుకులాల ఉద్యోగులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గిరిజన గురుకులాల్లో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఉద్యోగుల సమస్యలను పట్టించేకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కొడుకును విద్యాశాఖ మంత్రిగా చేసుకున్న చంద్రబాబుకు ఉద్యోగుల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. చాలీచాలనీ జీతాలతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులను విస్మరించడం సరికాదన్నారు. ఉద్యోగులు ధర్నాలు, ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఆప్కాస్ నుంచి తొలగించి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించే వరకు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిప్రతం అందించారు. కార్యక్రమంలో ఈఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు లోకన్న, విజయ్, ముత్యాలన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గీతా పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: భగవద్గీత ప్రచారంలో భాగంగా సోమవారం సామూహిక గీతా పారాయణంతో ఇస్కాన్ మందిరం మార్మోగింది. కృష్ణనామస్మరణతో ప్రతిధ్వనించింది. ఒకేసారి 1,008 మంది విద్యార్థులు భగవద్గీతలోని అర్జున విషాదయోగం, సాంఖ్య యోగంలోని శ్లోకాలను పారాయణం చేశారు. సర్వాంగ సుందర అలంకారంలో ఉన్న రాధాపార్థసారథులకు విశేష పూజలు జరిగాయి. ఇస్కాన్ ప్రతినిధి సత్యగోపీనాథ్ ప్రభు మాట్లాడుతూ.. నిస్సారమైన చిన్నారుల జీవితాలలో వెలుగులు నింపుకోవడానికి భగవద్గీత పారాయణం అత్యవసరమన్నారు. భగవద్గీత కుల మతాలకు సంబంధించిన గ్రంథం కాదని.. మానవాళిని సక్రమ పద్ధతిలో నడిపించడానికి గీతాచార్యుడు అందించిన గొప్పమార్గదర్శనమన్నారు. చిన్ననాటి నుంచే గీతా పారాయణంతో భవిష్యత్తు జీవితం సుఖవంతమవుతుందన్నారు. సమస్యల సుడిగుండంలో ఉన్న సమాజానికి భగవద్గీత దివ్యజ్యోతిలాంటిందన్నారు. దేశవ్యాప్తంగా గీతా ప్రచారం సాగుతోందని... అందులో భాగంగా అనంతపురం ఇస్కాన్ వారు ఇతోధికంగా తోడ్పాటునందించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు యోగ్యతా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అనంత ఇస్కాన్ మందిర అధ్యక్షుడు దామోదర గౌరంగదాసు, రాజమండ్రి ఇస్కాన్ మందిర అధ్యక్షుడు శ్యామ్ మురారి ప్రభు, గీతా ప్రచార యజ్ఞాన్ని నిర్వహిస్తున్న పరమకరణ ప్రభు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం



మాట్లాడుతున్న అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు

అనంతపురం: నగరంలో ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఇక నుంచి అనంతపురం నగరంలో ట్రాఫిక్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ఉల్లంఘనలపై చర్యలు చేపట్టామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఆర్సీలు, ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్, అపోజిట్ డ్రైవింగ్, నంబర్ లెస్ వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్, రేసింగ్‌లపై దృష్టి పెడతామన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే ఆ తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉల్లంఘనదారులపై భారీగా జరిమానాలు విధిస్తామన్నారు. అంతేకాకుండా ఉల్లంఘనలకు పాల్పడిన సదరు వాహనాలను ఆర్టీఏ విభాగం వారికి పంపుతామన్నారు. ప్రజలు పోలీసులతో సహకరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీలు లేకుండా వాహనాల్లో తిరగరాదన్నారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఓవర్‌లోడ్‌తో ఆటల్లో ప్రయాణికులను తరలించరాదన్నారు. కార్యక్రమంలో అనంతపురం నగర సీఐలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా సూర్య, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్, ఇతర కార్యకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జనవరి 7వ తేదీన రాయదుర్గంలో జరిగే ఏఐవైఎఫ్ నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

నకిలీ విద్యార్థి సంఘాలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు కే.సుబ్బారెడ్డి

అనంతపురం: ప్రైవేట్ పాఠశాలల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు కే.సుబ్బారెడ్డి, కార్యదర్శి రవి శంకర ప్రసాద్ కోరారు. సోమవారం ఎస్పీ పి.జగదీష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల పేరుతో కేవలం విజిటింగ్ కార్డు తెచ్చి వేలాది రూపాయలు కావాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. డబ్బు చెల్లించాలని బెదిరిస్తున్న నకిలీ విద్యార్థి సంఘాల నాయకుల పేర్లను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. జిల్లా సదస్సు, రాష్ట్ర సదస్సుల పేర్లతో వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. క్యాలెండర్ చందాల పేరుతో నిత్యం 20 నుంచి 30 బ్యాచ్‌లు పాఠశాలలకు వస్తూ డబ్బు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వీరి ఆగడాలను అరికట్టి పాఠశాలలను కాపాడాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) ట్రెజరర్ శ్రీనాథ్, సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, చంద్ర, సంజీవ రెడ్డి, నాగరాజు, గౌరవాధ్యక్షుడు నాయుడు, ఉపాధ్యక్షుడు మారుతి, రామచంద్రా రెడ్డి, శశిభూషణ్, అన్వర్, సుగుణాకర, శ్రీనివాసులు, రామ్మూర్తి, శశికళ, జయచంద్ర, శ్రీదేవి, రూప, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహరసుతుడికి లక్ష పుష్పార్చన



పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలోని హరిహరసుత అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం లక్ష పుష్పార్చన కనుల పండువగా సాగింది. కో–ఆప్షన్ మెంబర్ గంగన లక్ష్మీరెడ్డి, కొర్రపాటి శ్రీనివాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వందల సంఖ్యలో అయ్యప్ప మాలధారులతో పాటూ భవాని, వేంకటేశ్వర, శివస్వాములు స్వామివారి పుష్పార్చనలో పాల్గొన్నారు. భజనలతో స్వామిని ఆరాధించుకున్నారు. గురుస్వామి రంగాచారి బృందం ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు అర్చకులు హర్షస్వామి అయ్యప్పను శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక భిక్ష జరిగింది. నిర్వాహకులు మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయంలో గత నెల 15న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు జనవరి 15 వరకు జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో నిత్య భిక్ష ఏర్పాటు చేశామన్నారు. తెలిపారు. పుష్పార్చనకు సహకారమందించిన శ్రీనాథరెడ్డి, అన్న వితరణ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, ప్రకాష్ నాయుడు, హర్షవర్ధన్ రెడ్డి, మహేష్, బ్రహ్మానంద రెడ్డి, ఉమేష్ పాల్గొన్నారు.

కమిషనర్ రామలింగేశ్వర్ బాధ్యతల స్వీకరణ



అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థ 44వ కమిషనర్‌గా రామలింగేశ్వర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కమిషనర్‌గా ఉన్న నాగరాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో అదనపు కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్‌కు ప్రభుత్వం ఫుల్ అడిషినల్ చార్జ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నూతనంగా బాధ్యతలు తీసుకున్న కమిషనర్‌కు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి అందరూ అంకిత భావంతో పని చేయాలని సూచించారు. వివిధ సెక్షన్ హెడ్స్‌తో ప్రస్తుతం జరుగుతున్న పనులు తదితర వాటిపై ఆరా తీశారు. ఈయన గతంలో రాయదుర్గం, పుంగనూరు, ఆముదాలవలస, చిలకటూరి పేట, ఆదోని మునిసిపల్ కమిషనర్‌గా, కర్నూలు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పని చేశారు. సొంతూరు అనంతపురం జిల్లా మడకశిర. అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల, ఎస్కేయూలో విద్యాభ్యాసం చేశారు.

ఈ-పాస్ పుస్తకాలు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు: మండలంలో దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ఈ–పాస్ పుస్తకాలను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు క్రాప్ రుణాలు పొందాలంటే బ్యాంకు సిబ్బంది తప్పనిసరిగా ఈ–పాస్ పుస్తకాలు అడుగుతున్నారని తెలిపారు. ఈ–పాస్ పుస్తకాలు లేకుంటే రుణాలు ఇవ్వమని చెబుతున్నారన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దరఖాస్తులను పరిశీలించి ఈ–పాస్ పుస్తకాలను అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ లక్ష్మీనాయక్ తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు శివ, రైతులు గోపాల్, గోవింద్, హనుమన్న, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై దయ చూపరా?

- డీఏ, అరియర్స్ ప్రకటనలో ప్రభుత్వం విఫలం
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా హామీ నెరవేర్చని కూటమి

సందర్భం: నేడు పెన్షనర్ల దినోత్సవం




సమావేశమైన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు

అనంతపురం కల్చరల్: ఇబ్బందులెన్ని ఎదురైన శ్రమ వదలని స్ఫూర్తిదాయక సేవలు వారివి. కుటుంబాన్ని, ప్రభుత్వ మార్గదర్శకాలను సమాంతరంగా నడిపించి ఉద్యోగ విరమణ చేశారు. తమ అనుభవంతో సమాజానికి సేవలందిస్తున్న ఆదర్శప్రాయులు వారు. అలాంటి పెన్షనర్లకు రావాల్సిన వాటిని ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోంది. అరియర్స్, డీఏల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ ఊసురుమంటున్నారు. గత ఎన్నికల వేళ పెన్షనర్లకు అరచేతిలో స్వర్గం చూపించిన ప్రభుత్వం ఇన్ని నెలలు గడుస్తున్నా ఇస్తామన్న అరియర్స్ కానీ, డీఏలు కానీ ఇంత వరకు ఊసే ఎత్తకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. అలాగే పీఆర్‌సీ విడుదల చేస్తామన్న మాటే మరచిపోయినట్టున్నారని మండిపడుతున్నారు. సరాసరి ఒక్కో విశ్రాంత ఉద్యోగికి కనీసం రూ.లక్షల వరకు బకాయిలు ఉండటంతో ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు

ఐక్యమత్యంగా ఉంటూ ప్రత్యేక సంఘంగా ఏర్పడిన పెన్షనర్లు తమ కార్యక్రమాల నిర్వహణకు నగరంలో మూడున్నర దశాబ్దాల క్రితం పెన్షనర్ల హోం నిర్మించుకున్నారు. అప్పటి ప్రభుత్వ విధానాలకు కొమ్ము కాస్తున్నారంటూ విబేధించిన ముడార్ వేణుగోపాల్ నేతృత్వంలో తొమ్మిదేళ్ల కిందట 'విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం' పేరిట మరొక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఏటా డిసెంబరు 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఆ నేపథ్యంలో మంగళవారం రెండు వేర్వేరు సంఘాల వారు ఎల్కేపీ, ఉపాధ్యాయ భవన్‌లో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 75 ఏళ్ల పైబడిన పెన్షనర్లకు సన్మానాలు, కళా, సాహిత్య ప్రతిభా ప్రదర్శనలు చేస్తున్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



నేను 2006లో పంచాయితీ రాజ్ శాఖలో ఏఈగా పదవీ విరమణ చేశాను. ఇప్పటికీ ఉత్సాహంగా ఉంటున్నానంటే సామాజిక కార్యక్రమాలలో విరివిగా పాల్గొంటుండడమే. జనవిజ్ఞాన వేదిక, సమాచార హక్కు చట్టం వంటి వాటితో పాటూ విశ్రాంత ఉద్యోగుల సంఘంలో భాగస్వామి అవుతూ కొంతైనా సమాజానికి ఉపయోగపడుతున్నాను. ప్రభుత్వం అరియర్స్, డీఏలు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే చెల్లించాలి. దానిపైనే ఆధారపడిన వారు ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

– ప్రభాకర గుప్తా, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



పూజలందుకున్న ఐశ్వర్యేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నెలరోజుల పాటూ సాగే ధనుర్మాస పూజలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని శ్రీ క్షేత్రం (లక్ష్మీ హయగ్రీవ, లక్ష్మీ వేంకటేశ్వర, గోదా రంగనాథ స్వామి దేవస్థానం)లో తెల్లవారుజామున అభిషేకాలతో ధనుర్మాసాన్ని ప్రారంభించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమాలను మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంట్) జ్వాలాపురం శ్రీకాంత్ ముఖ్య అతిథిగా ప్రారంభించి తీర్థప్రసాదాలనందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధనుర్మాసం జనవరి 13 వరకు ఉంటుందని తెలిపారు. ఆలయంలో నిత్యం తిరుప్పావై, తిరుప్పాలాండ్ పఠనం సాగుతుందన్నారు. సాయంత్ర సమయాల్లో లక్ష్మీ అష్టోత్తరం, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం జరుగుతాయని భక్తులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అంబళం రఘునాథ్, శేషాచార్యులు, హరిప్రియ, విష్ణుప్రియ, అర్చకులు రాఘవాచారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు. ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో హెచ్చెల్సీ కాలనీలోని అనంత ఐశ్వర్యేశ్వర స్వామికి రుద్రాభిషేకాలు జరిగాయి.